"లేదు..."

"ఊర్లో లేరా?"

"ఈ లోకంలో లేదు."

"ఐ యామ్ సారీ!" మళ్లీ అంది బాధగా.

తను మొదటిసారి వాళ్ళను చూడగానే 'అందమైన జంట' అనుకుంది. దురదృష్టవశాత్తూ ఇద్దరూ తమ జంటని కోల్పోయిన వాళ్ళే! 'భగవంతుని దయవల్ల వీళ్ళిద్దరికీ జత కలిస్తే బాగుంటుంది!' అనుకుంది హిమబిందు.

పాపను చూసి మందులు రాసిచ్చింది. కార్తీక్ ఫీజు చెల్లించి మెడికల్ షాపుకు వెళ్ళాడు. హాస్పిటల్‌కి ఆనుకొనే ఉంది ఆ షాపు. అక్కడ అర్చన మందులు కొంటోంది.

"సారీ... మీకు ఇబ్బంది కలిగినట్లుంది!" అన్నాడు ఆమెతో.

"తప్పు నాదే! పేరు సరిగ్గా వినకుండా లోపలికి వచ్చేశాను. మీకు ఇబ్బంది కలిగించాను."

"ఇబ్బందేం లేదు. బహుశా మనం ఒకరికొకరు పరిచయం అవ్వాలని రాసిపెట్టి ఉండటం వల్ల అలా జరిగి ఉండొచ్చు. నా పేరు కార్తీక్... లెక్చరర్‌గా పనిచేస్తున్నాను."

"నా పేరు అర్చన... నేను టీచర్ని!"

"మీవారు?"

"లేరు..."

"సారీ! నేనూ ఒంటరివాడ్నే... విశాల తల్లి లేని పిల్ల!"

"ఉంటానండీ!" అంటూ వెళ్లిపోయింది అర్చన.

మందులు కొని కార్తీక్ స్కూటరు వైపు నడిచాడు... కూతురు విశాలతో.

• • •

లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌లో బాబును చేర్పించి బయటకు వచ్చింది అర్చన.

కార్తీక్ ఎదురొచ్చాడు ఆమెకు.

"హలో,.. విశాల్‌ని చేర్పించడానికి వచ్చారా?" అంటూ పలుకరించాడు.

"అవును... మీరు?"

"విశాల ఇక్కడే చదువుతోంది. ఈరోజు స్కూలు రీ ఓపెనింగ్ కాబట్టి ఫీజు కట్టడానికి వచ్చాను. మీ పని పూర్తయిందా?"

లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"ఇక్కడ పనిచేసేవాళ్ళంతా నాకు బాగా తెలిసినవాళ్ళే. ఏదైనా అవసరమయితే చెప్పండి!"

"విశాల్ అడ్మిషన్ అయింది. కానీ, నా పని ఒకటి ఉంది. ప్రస్తుతం నేను పనిచేసే స్కూల్లో జీతం చాలా తక్కువ ఇస్తున్నారు. ఈ స్కూల్లో జీతాలు బాగా ఇస్తారని విన్నాను. అందువల్ల ఇక్కడ ఖాళీలేమైనా ఉన్నాయేమో కనుక్కుందామనుకుంటున్నాను."

"ఉండండి... నేను ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడి వస్తాను!" అంటూ వెళ్లిపోయాడు.

పది నిమిషాల తర్వాత వచ్చి, "విజిటర్స్ రూంలో కూర్చోండి. అరగంట తర్వాత మిమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తారు. నచ్చితే మిమ్మల్ని ఉద్యోగంలో తీసుకుంటారు. ఈరోజు మంచిరోజు. ఈరోజే ఉద్యోగంలో చేరిపొండి. నా పేరు రెఫర్ చెయ్యండి!" అన్నాడు.

